స్త్రీల సాహిత్యం

# స్త్రీ సమస్యలు - పరిచయం

దొమితిల బారియోస్ ది చుంగా

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

305.4

వెల : 0-75

305.4

C 7758

A/C 3,412

ట్రస్ట్ సంపాదకుడు : చేకూరి రామారావు
అనువాదం : ఓల్గా
మొదటి ముద్రణ : ఆగస్టు, 1984
వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్
3-6-697, హిమాయత్‌నగర్
హైదరాబాద్ -500 029

---

ముద్రణ: నాట్యకళ ప్రెస్, ఖైరతాబాద్, హైదరాబాద్.

# స్త్రీ సమస్యలు - పరిచయం

మొదట మనం మొత్తం స్త్రీ సమస్యల గురించి మాట్లాడుకుందాం. బొలీవియాలోనేకాదు ప్రపంచమంతటా స్త్రీ అణచబడుతోంది. సంఘంలో అధమాధమ స్థానానికి నెట్టివేయబడుతోంది ఆమె యెంత ఘోరంగా అణిచి వేయబడిందంటే మనం రోజూ చూస్తూనే వున్నాం - ట్రేడ్ యూనియన్ సంస్థలలో కూడా పాల్గొనే అవకాశం లేని స్థితిలో స్త్రీలు వున్నారు.

పుట్టిన దగ్గరి నుండీ మనల్ని చిన్నచూపు చూస్తున్నారు. ఇంట్లో ఆడదాని స్థితి యేమిటో చూద్దాం. కొడుకు పుడితే తండ్రి సంతోషంతో పండగ చేసుకుంటాడు. మగాడు పుట్టాడని గర్వపడతాడు. ఆ పండగ సంబరం అంతా మగపిల్లవాడు పుట్టినందుకే. ఇది వాస్తవం కదూ? ఆడపిల్ల పుడితే ఆ తండ్రి ఏమంటాడు ? "ఎందుకీ పనికి మాలినది ? ఛస్తే పీడా పోతుంది" అంటాడు. చివరకు ఆడవాళ్ళు కూడా ఆ తల్లితో "సిగ్గులేకుండా ఆడపిల్లను కన్నావు. ఎందుకీపిల్ల ఛస్తే పీడ వదుల్తుంది" అంటారు.

సమాజం మనల్ని మనమే కించపరుచుకోవటం నేర్పింది. ఇది నిజం కదూ ?

స్త్రీలు లేకపోతే ఈ ప్రపంచం ఎక్కడుంటుంది ? ఎంతో దూరం పోలేదు. కానీ మనల్ని మనం కించపరుచుకోవటం, మన శక్తుల్ని తక్కువచేసి చూసుకోవటం మనకు అలవాటయి పోయింది. మన ట్రేడ్ యూనియన్లలో, రాజకీయ పార్టీలలో చేరితే విమర్శించే ఆడవాళ్ళు కూడా వున్నారు. "ఈ ఆడవాళ్ళకు వేరే పనీపాటా ఏమీలేదు. లేకపోతే వాళ్ళకి అవసరమైన విషయాల్లో జోక్యం యెందుకు ?'' అని ఆ స్త్రీలు మనల్ని విమర్శిస్తారు. ఆడవాళ్ళే ఆడవాళ్ళను విమర్శిస్తున్నారు. ఎందుకంటే పుట్టి నప్పటి నుంచీ మనం ఆ రకమైన వాతావరణంలో పెరిగాం. ఆ రకమైన భావాలు ఉగ్గుబాలతో నేర్చుకున్నాం. బొలీవియాలోనే కాదు ప్రపంచమం

తటా యిదే పరిస్థితి. కానీ చరిత్ర తిరగేసి చూస్తే స్త్రీలు తాము మగవారితో సమానంగా రాజకీయ సాంస్కృతిక విషయాలలో పాల్గొనే శక్తి గలవారమనే నిరూపించుకున్నారు. యుద్ధరంగంలో పురుషుల పక్కన నిలబడి పోరాడి తమ శక్తిని చూపారు. మన దేశంలో యిందుకు ఎన్నో ఉదాహరణలున్నాయి. లా కరోనిల్లాలో స్త్రీలు ఒంటరిగా పోరాడలేదా ? స్వతంత్ర పోరాటంలో పురుషులతో పాటు స్త్రీలు పోరాడలేదా ? నికారాగువ వంటి దేశాలలో కూడా స్త్రీ పురుషులు కలిసి పోరాడారు.

నేను చెప్పదల్చుకున్నది - మనం స్త్రీలం. హక్కులన్నిండితోనూ పుట్టాం. బొలీవియాలో స్త్రీలు అన్ని కార్యక్రమాలలోనూ పాల్గొనే హక్కు నిస్తూ ఒక చట్టం కూడా వుంది. 1948లో ప్రపంచ దేశాలన్నీ ఐ.రా.సలో ఒక చోటికి చేరాయి. అక్కడ మానవ హక్కుల గురించి న్యాయ సూత్రాలు తయారు చేశారు. ఆ న్యాయ సూత్రాలలో అన్ని కార్యక్రమాలలో పాల్గొనే హక్కు వుందనే విషయం కూడా చెప్పారు. మనకు క్లబ్బుల్లో, యూనియన్లలో, రాజకీయ పార్టీలలో పాల్గొనే హక్కువుంది. అలాగే మగవారివలే చదువుకునే హక్కు, వారితో సమానంగా జీతాలు తీసుకునే హక్కూ మనకు వున్నాయి. చట్ట ప్రకారమే మనకీ హక్కులన్నీ వున్నాయి. బొలీవియాలో కూడా "బొలీవియన్ స్త్రీలు అన్ని విషయాలలో పాల్గొన వచ్చునని" రాసిన డాక్యుమెంటుపై ప్రభుత్వం సంతకం చేసింది. కానీ 1948 నుంచీ యిప్పటి వరకూ స్త్రీల చదువు గురించీ, శిక్షణ గురించీ అనేక కార్యక్రమాల్లో పాల్గొనటం గురించీ పట్టించుకుని ప్రోత్సహించిన ప్రభుత్వం ఏదైనా వుందా ? ఒక్కటి కూడా లేదు. స్త్రీల కొరకు వాళ్ళు చట్టాలు చేశారంటే దానివల్ల లాభపడే రాజకీయ పార్టీలున్నాయి. లాభపడే వర్గాలున్నాయి. ఆ లాభం పొందాక వారు స్త్రీల స్థితి మరచిపోయారు. మురికిగా వున్న టేబిల్‌ను శుభ్రంచేసి మళ్ళీ అవసరమొచ్చేదాకా ఏ మూలో దాచిపెడతామే అటువంటి మనిషట స్త్రీ. మనల్ని ఆ విధంగానే వాళ్ళు ఉపయోగించుకుంటున్నారు. ఆ స్థితిలో వున్నందుకు మనల్ని మనమే నిందించుకోవాలి. వాళ్ళు మనల్ని ఆ రకంగా వినియోగించుకోటానికి మనం అనుమతిస్తున్నాం. మనల్ని మనమే విమర్శించుకుంటున్నాం. ఏదో ఒక సంఘంలో చేరి పనిచేస్తున్న స్త్రీలను పనిపాటా లేనివారిగా ఎన్నిసార్లు మనం అనిపోసుకోలేదూ ?

స్త్రీ ఏదైనా సంఘంలో చేరగానే ఆనాయకుల్లో ఎవరితోనో ఆమెకు

సంబంధం వుందని ఎన్నిసార్లు పుకార్లు పుట్టించలేదు? ఆ నాయకులుకూడా ఈ స్త్రీలు తమతో కాలక్షేపం చెయ్యటానికే వస్తున్నారని అనుకోలేదూ? మనం చెయ్యాల్సిందేమిటి? ముందు మనకు ఏం కావాలో మనం నిర్ణయించుకోవాలి. ఎందుకంటే ప్రపంచమంతటా స్త్రీలు తమ విముక్తికోసం రకరకాల కారణాలతో రకరకాల పద్ధతులలో పోరాటం చేస్తున్నారు.

1975లో మెక్సికోలో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో నేను రెండు రకాల విముక్తి వాదాలను చూశాను. ఒకరకంవారు ఏమంటారంటే పురుషులతో వారి వ్యసనాలన్నిటిలో సమానం కాగలిగినపుడే స్త్రీ విముక్తి చెందుతుందంటారు. అంటే స్త్రీలు పురుషులతోపాటు సిగరెట్లు తాగటానికీ, మద్యం తాగటానికి హక్కు కావాలని పోట్లాడతారు. ఉదాహరణకు ఈ సమావేశంలో వాళ్ళిలా అన్నారు. "ఇవాళ రాత్రి పురుషుడు జల్సాచేసి వస్తే రేపు రాత్రి నేనూ అలాగే జల్సాచేసి వస్తాను" కానీ నిజంగా మనం సిగరెట్లు తాగాలనుకుంటున్నామా? నిజంగా మన భర్తల్లాగే మనం కూడా తాగితందనాలాడుదామనుకుంటున్నామా? నేనలా అనుకోవటం లేదు. మగాడికి పదిమంది ఉంపుడుగత్తెలుంటే మనకి పదిమంది విటులుండాలా? అంటే మనం ఏంచేస్తున్నాం? ప్రజల్ని హీనంగా చూస్తున్నాం. అంతకుమించి మరేమీ లేదు. మనం మన సాటి స్త్రీలతో పోరాటం కాదు చెయ్యాల్సింది. వారి తప్పుల్ని కాదు నేర్చుకోవాల్సింది. మనం పురుషుల నుంచి మంచి విషయాలు నేర్చుకోవాలి.

పైన చెప్పిన విముక్తి సంపన్న వర్గాల మహిళలకు మాత్రమే చెందినది. వాళ్ళకు సమస్త సౌకర్యాలూ వుంటాయి. అందుకని పురుషుల వ్యసనాలను అనుకరించాలని వారు కోరుకుంటారు. కానీ మనదేవర్గమో తెలుసుకున్నపుడు మనకే రకమైన విముక్తికావాలి? సంపన్నవర్గాంస్త్రీలూ, అమెరికన్ స్త్రీలూ కోరుకునే విముక్తి మనకు కావాలా? లేక యింకొక రకం-స్త్రీలు కూడా మానవులనే గౌరవంతో స్త్రీలు కూడా సామాజిక సమస్యలను పరిష్కరించగలరనీ అన్ని రంగాల్లోనూ పాల్గొనగలరనీ నిరూపించే విముక్తి కావాలా? ఇంటా బయటా కూడా మన అభిప్రాయాలకు విలువనిచ్చే విముక్తి కావాలి మనకి కొన్నిసార్లు తల్లులుగా మన పిల్లల్ని సరియైన దోవలో పెట్టే అవకాశం కూడా వుండదు. మధ్యలో పిల్లల తండ్రి వచ్చి మనల్ని నాలుగు తన్ని మన అధికారాన్ని లాక్కుంటాడు. చివరకు పిల్లలకు మనమీద బొత్తిగా గౌరవం లేకుండాపోతుంది

తండ్రి చనిపోయాక పిల్లలు మనల్ని నోరెత్తనివ్వరు. మనల్ని మూర్ఖుల కింద జమకట్టేస్తారు. ఇది వాస్తవం కాదా? ఇదంతా ఎందుకు జరుగుతోంది? ఎందుకంటే ఆచరణలో ఒక సత్యం రుజువయింది. స్త్రీలు ఎక్కువ మేధావంతులు, ఎక్కువ పట్టుదలగలవాళ్ళు, ఎక్కువ నిజాయితీపరులు. ఒక స్త్రీ నాయకత్వ స్థానానికి చేరుకున్నదంటే ఆమె యిక ఎన్నటికీ శత్రువుకి అమ్ముడుపోదు. ఆమెకు ఏ వ్యసనాలూ బలహీనతలూ వుండవు గనుక తన పోరాటంలో ఎక్కువ చైతన్యంతో వుండగలదు. అందుకే దోపిడీదారులు స్త్రీలను ఏ కార్యక్రమంలోకీ రానివ్వరు.

స్త్రీలు మహిళా సంఘాలుగా యేర్పడాలని మన కామ్రేడ్స్ చాలా మంది చెబుతారు. మొదట్లో అంతా ఉత్సాహంగానే ఉంటారు. క్రమంగా నిరుత్సాహపడతారు. నీరసపడతారు. కొన్నిసార్లు మన పురుషులు చైతన్యంతో పోరాటానికి సాయపడుతుంటారు. తర్వాత పోరాటాన్ని ప్రభుత్వం తీవ్రంగా అణిచివేస్తున్నపుడు స్త్రీలేమంటారు? భార్య తన భర్తతో యిలా అనటం మొదలుపెడుతుంది. "నీకు నేనూ పిల్లలూ ముఖ్యమా? పార్టీ యూనియను ముఖ్యమా? తేల్చుకో". నీవు యూనియన్‌కి వెళ్తుంటే నేను నిన్ను వదిలి వెళతానని బెదిరిస్తుంది. అందుకే పురుషులు మనల్ని విమర్శిస్తారు. పోరాటంలోకి వెళ్ళమని ప్రోత్సహించి సహాయపడటం కాకుండా అడ్డుతగులుతున్నామని నిందిస్తారు. కొందరు స్త్రీలు నిజంగా తమ భర్తల్ని అవమానపరిచారు.

పురుషులెందుకు సంఘటితపడుతున్నారో స్త్రీలు ఆసక్తితో అర్థం చేసుకోవటం మంచిది. వాళ్ళను ప్రోత్సహించి వారితో కలిసి పనిచెయ్యటం యింకా మంచిది. స్త్రీలు చైతన్యవంతులవుతున్నపుడు పురుషులొకోసారి అసూయపడతారు. స్త్రీలు తమను అణచివేస్తారని భయపడతారు. కలిసి పనిచెయ్యటం ద్వారానే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

స్త్రీలు అన్ని రంగాల్లోనూ పాల్గొనవచ్చునని చెప్పే అంతర్జాతీయ సూత్రాలు ఎన్నో వున్నాయని చెప్పాను గానీ ఆచరణ కొచ్చేసరికి ఏమీ జరగటం లేదు. ఉదాహరణకు బొలీవియాలో కొన్ని మహిళా సంఘాలున్నాయి. ఆ సంఘాలు అధికారంలో ఏ ప్రభుత్వం వుంటే దానికి సేవ చేస్తాయి. ఆ సంఘాలకు ప్రభుత్వం ఎన్నో విధాల అండగా వుంటుంది. కానిఫ్, రోటరీ, లేడీ లయన్స్, పౌరకార్యాచరణ గ్రూపులూ యింకా నాకు తెలియని అనేక సంస్థలు యిటువంటివి వున్నాయి. పోయిన సంవత్సరం

అనేక వేలమంది పిల్లలు ఆకలితో చచ్చిపోతున్నారన్న సంగతి ఒకరోజున ఆ సంఘాల వారికి హఠాత్తుగా గుర్తువచ్చింది. దానితో వాళ్ళు ఆ రోజు తాగే చాక్లెట్ కప్పులను ఆ పిల్లలకు యిచ్చేశారు. వాటితో ఏడాది పొడుగునా ఆ పిల్లల ఆకలి మంటను ఆర్పేశామనే అనుకున్నారు. ఈ సంఘాలకు ప్రభుత్వం సహాయం చేస్తుంది. ఈ సంఘాల వాళ్ళకు అన్నిరకాల ప్రభుత్వ సహాయాలనూ అందుకోవటం తప్ప అణచివేత అంటే ఏమిటో తెలియదు. ఐతే కార్మికుల భార్యలు చైతన్యంతో సంఘం పెట్టుకుంటే ఏం జరుగుతుంది? వాళ్ళను అణచివేస్తారు. కార్మికుల ఐక్యత నెట్లా నాశనం చేస్తారో కార్మికుల భార్యల ఐక్యతనూ అట్లాగే నాశనం చేస్తారు. మన నోళ్ళు మూసెయ్యాలనుకుంటారు. మనల్ని భయపెట్టాలనుకుంటారు. కొన్నిసార్లు మనం భయపడి "ఇక నేనీ సంఘంలో పనిచెయ్యను" అని అంటాం కూడా. మనం అలా అంటే ఎవరికి లాభం? మనల్ని దోపిడీ చేసే పెట్టుబడి దారులకు.

స్త్రీలకు ఉద్యమ కార్యకర్తలుగా పనిచేసే అలవాటులేదనే విషయం మన అనుభవాల వల్లే మనకు తెలుసు. అలా పని చెయ్యటానికి మనం ఎన్నడూ సాహసించలేదు. ఎందుకంటే- మగవాడు వీధిలో వ్యవహారాలు చక్కబెట్టాలనీ స్త్రీలు యింటికంటిపెట్టుకుని ఉండాలనీ మనకు చిన్నతనం నుంచీ బోధించారు పిల్లల్ని చూసుకుంటూ, వంటచేసుకుంటూ, బట్టలు కుట్టుకుంటూ వుండే పని స్త్రీదనీ, బజారుకెళ్ళి రాజకీయాల్లో తిరిగి మీటింగులకీ సినిమాలకూ స్వేచ్ఛగా తిరిగే అవకాశం పురుషుడి కుందనీ చెప్పారు. నిజం కదూ? స్త్రీల నణచటానికి మతాన్నికూడా ఉపయోగించుకున్నారు. మరి మతం కుటుంబానికి అధిపతి మగవాడని చెబుతుందికదా. పురుషుడు అధిపతి గనుక అతను అన్యాయంగా ప్రవర్తించినా ఆడది అదేమనకుండా పడివుండాలి. దేవుడు మానవుని తనలాగానే తన ప్రతిబింబంగా తయారు చేశాడు. తరువాత దేవుడు స్త్రీని తయారు చేశాడు కానీ దేవుడు స్త్రీని పురుషుడి తలనుండి తయారు చేశాడా? అలాగైతే అతన్ని మించవచ్చు. పోనీ అతని కాళ్ళ వేళ్ళనుండి తయారుచేశాడా? అలాగైతే స్త్రీ నతను తొక్కెయ్యవచ్చునని అనుకోటానికి. లేదే- స్త్రీని తయారు చెయ్యటానికి దేవుడు పురుషుని పక్కటెముకని తీసుకున్నాడు. అంటే ఆమె అతని సహచరి అన్నమాట. ఆమె అతనికంటే గొప్పదీ కాదు. అధమురాలూ కాదు. స్త్రీ పురుషులిద్దరూ కలిసి ప్రయాణం

చెయ్యాలి. దానికి ఒకే రకమైన శిక్షణ పొందాలి.

సంతోషించాల్సిన విషయం ఏమిటంటే ఒక్క బొలీవియాలోనే గాక అన్ని చోట్లా స్త్రీలు ఆందోళనకు చైతన్యంతో సిద్ధపడుతున్నారు. మనదేశంలో కూడా చైతన్య వంతులై ఏదో ఒక రంగంలో పనిచేస్తున్న మహిళా గ్రూపులున్నాయి.

## సైగ్లో 20 గృహిణుల సంఘం

నేనిప్పుడు మీకు సైగ్లో 20 గృహిణుల సంఘం అంటే గని కార్మికుల భార్యల సంఘం ఎలా పుట్టిందో చెప్తాను. గ్రామాల్లో లాగానే గనుల ప్రాంతాల్లో కూడా స్త్రీలను పోరాటాల్లోకి రానివ్వరు. ఐతే కార్మికులపై అణచివేత ఎక్కువై నాయకుల్ని జైళ్ళలో పెట్టారు ఒకసారి. ఆ నాయకుల భార్యలు ఒక్కొక్కరే లాపాజ్ వెళ్ళి తమ భర్తల్ని వదిలి పెట్టమని విజ్ఞప్తి చేసుకున్నారు. వాళ్ళలో ఒకామె పిల్లలతో సహా వెళ్ళేది. ఆమె భర్తను లొంగదీయటానికి ఆమెను కూడా జైల్లో పెట్టాలని అధికారులు అనుకున్నారు దాంతో ఆ స్త్రీలంతా సైగ్లో 20 కి తిరిగివచ్చి యూనియన్ ఆఫీసుకు వెళ్ళారు. అప్పుడు వాళ్ళందరికీ తెలిసింది 60 మంది నాయకులను జైల్లో పెట్టారని. 60 మంది స్త్రీలు యూనియన్ ఆఫీసులో మాట్లాడుకుంటుండగా ఒకామెకు మంచి ఆలోచన వచ్చింది. మనం ఒక్కొక్కళ్ళమూ వెళ్ళి అడగటంకంటే 60 మందిమీ కలిసి వెళ్ళి మన భర్తల్ని వదిలేదాకా అక్కడినుంచి కదలమని కూర్చుంటే ఏమైనా ప్రయోజనం వుంటుందేమో అన్నదామె. ఇకప్పుడు 60 మంది కలిసి లాపాజ్ వెళ్ళి తొమ్మిది రోజులు నిరాహారదీక్ష చేసి వాళ్ళ భర్తల్ని విడిపించుకున్నారు.

అది 1961 జూన్‌లో జరిగింది. ఆ తొమ్మిది రోజులూ వాళ్ళంతా ఐక్యంగా వున్నారు. తర్వాత కూడా ఏదో ఒక రకమైన సంఘంగా తామంతా ఐక్యంగా వుండాలని నిశ్చయించుకున్నారు. దాని ప్రకారం వాళ్ళు సైగ్లో 20 కి తిరిగి రాగానే గృహిణులందరినీ పిలిచి సమావేశపరచి గృహిణుల సంఘాన్ని సైగ్లో 20 లో ఏర్పరిచారు. అదృష్టవశాత్తూ ఈ సంఘానికి నార్బేటా అగిలార్ అనే మంచి నాయకురాలు దొరికింది. ప్రారంభంలో నేనా సంఘంలో లేను. వాళ్ళు చెప్పే మాటలు వింటూ చేసే పనులు చూస్తూవుండేదాన్ని.

ఆ సంఘంలో సభ్యులనుకోటానికి గుర్తుగా చిన్న బాడ్జీలను పెట్టుకునేవారు. వాళ్ళు మాంసం అమ్మే దుకాణానికి వెళ్ళి మంచి మాంసం యిస్తున్నారా లేదా అని తనిఖీ చేసేవారు. మాకే సమస్య వచ్చినా బాడ్జీలు పెట్టుకున్న స్త్రీల దగ్గరకు వెళ్ళి చెప్పుకునే వాళ్లం. వాళ్ళు విచారించి పరిష్కరించే వాళ్ళు. ఈ గృహిణుల సంఘం సభ్యులు మొదటిసారి గని కార్మికుల యూనియన్‌కు వెళ్ళినపుడు ఎలాంటి స్వాగతం లభించిందనీ! ఆ కార్మికులు వీళ్ళని చూసి ఈల లేశారు. వీళ్ల నొక్కముక్క మాట్లాడనివ్వలేదు. చివరకు అరటి తొక్కలూ నారింజ తొక్కలూ వీళ్ళమీదకు విసిరి బయటకు నెట్టారు. ఆ స్త్రీలంతా ఏడుస్తూ వచ్చేశారు. ఆ మగవాళ్ళు వీళ్ళని చూస్తూ ఏమని అరిచారు ?

"ఈ ఆడవాళ్ళు యింట్లో పడివుండి పిల్లల్ని పెంచి వంటలు చేసి గుడ్డలుతకాలి గానీ వీధికెక్కి మీటింగులు ఎందుకు!"

ఐనా ఈ స్త్రీలు జంకలేదు. భయపడలేదు. ఇంకా ఉత్సాహంగా రేడియోల్లో మాట్లాడారు. పత్రికల్లో అనేక విషయాల గురించి రాశారు. కార్మికుల సహకారాన్ని కోరారు. యూనియన్ నాయకుల విడుదలకు గృహిణుల సంఘం కారణమైనా యూనియన్ ఈ సంఘాన్ని పట్టించుకోలేదు. పోనీ పట్టించుకోకుండా ఊరుకుందా? ఈ సంఘ సభ్యులు వాళ్ళ ప్రియులను కలుసుకోటానికే మీటింగులకి వెళ్తున్నారనీ రకరకాలుగా వాళ్ళపై బురద చల్లింది. ఈ సంఘ సభ్యులు యిళ్లల్లో కూడా ఎన్నో యిబ్బందుల పాలయ్యారు. 1968 వరకూ కార్మికులు గృహిణుల సంఘం అంటే వ్యతిరేకంగానే ఉన్నారు.

నేనెట్లా గృహిణుల సంఘంలో చేరాను? 1968లో యూనియన్ సభ్యులను అరెస్టుచేసినపుడు ఒక సభ్యురాలు నన్ను సంఘ సమావేశానికి పిలిచింది. నేను వెళ్లాను. నాభర్త ఏదో ఒకసారికి వెళ్ళొచ్చిందిలే యిక యింట్లోనే పడి వుంటుందనుకున్నాడు. కానీ నేను ప్రతి గురువారం సాయంత్రం 5 గం॥ నుంచీ 6 గం॥ వరకూ సమావేశంలోనే వుంటున్నాను. ఒక అరగంట యూనియన్ విషయాలు మాట్లాడుకుని యింకో అరగంట ఏ అల్లిక పనులో చెసుకునే వాళ్లం. తర్వాత యిళ్ళకు వెళ్ళేవాళ్ళం. నా భర్త జీతాలిచ్చే రోజు దాకా నా రాకపోకల్ని చూస్తూ ఊరుకున్నాడు. జీతాలొచ్చిన రోజు ఒక్కపైసా నాకివ్వలేదు. మర్నాడూ యివ్వలేదు. పైగా బాగా తాగివచ్చి నన్ను తన్నాలని చూశాడు. అత

నెందుకలా చేశాడో నాకు తెలియలేదు. మీటింగులకి వెళ్ళొద్దని అతనూ చెప్పలేదు.

మూడో నెలాఖరున కూడా అతనొక్క పైసా నాకివ్వలేదు. ఇక కుదరదని నిలదీసి అడిగాను. అతనేం చెప్పాడో తెలుసా? "నువ్వు యూనియన్‌కూ మీటింగులకూ పోతున్నావు దానివల్ల నాకేం ఒరుగుతుంది? డబ్బు కావాలంటే యూనియన్‌నే అడిగి తెచ్చుకో" అన్నాడు. "వారానికొక్కరోజే గదా పోతున్నాను. ఆ మీటింగులకు వెళ్ళి కొత్తరకం కుట్లు నేర్చుకున్నానని" చెప్పినా అతను వినలేదు. అతన్ని సమాధాన పరచలేకపోయాను. నా కాలమంతా యూనియన్‌లోనే ఖర్చుపెడుతున్నాను గనుక యూనియనే నాకు డబ్బిస్తుందంటాడు. నేను కాలమంతా యూనియన్‌లోనే గడిపేస్తే యింట్లో తిండెవరు వండుతున్నారు? గుడ్డలెవరు వుతుకుతున్నారు? పిల్లల్నెవరు చూస్తున్నారు?

నాకు చాలా కోపం వచ్చింది. ఏం చెయ్యాలో తెలియలా. ఒక రోజు వీధిలో కెళితే డాన్ పెడెరికే ఎస్కోబార్ అనే యూనియన్ నాయకుడు కనిపించాడు. అతను నన్ను గృహిణుల సంఘ సమావేశాలకు ఎందుకు వెళ్ళటం లేదని అడిగాడు. నేను జరిగిన సంగతంతా చెప్పాను. ఆయన అంతా విని "ఇంట్లో చాకిరంతా చేస్తున్నది నువ్వేనని మీ ఆయన కెందుకు గుర్తుచెయ్యలేదు? నువ్వు చెప్పాలి. ప్రశ్నించాలి. పోనీ నే వెళ్ళి మీ ఆయనతో మాట్లాడనా" అన్నారు. "ఒద్దొద్దు. అల్లా చేస్తే పరిస్థితి మరీ అధ్వాన్నమవుతుంద"న్నాను.

ఇంకోవారం గడిచింది. నన్నతను భార్యలా చూడటంలా. ఇంటి కొస్తున్నాడు, పోతున్నాడు, పిల్లలతో మాట్లాడుతున్నాడు. నాతో ఒక్క మాటా మాట్లాడటంలా. ఇది నేను భరించలేకపోయాను. అంతకుముందు అతను నాతో అన్నీ పంచుకునే వాడు. అతనిట్లా వుంటే నాకెంతో బాధనిపించింది.

చివరికోరోజు నిశ్చయించుకున్నాను. "ఇంట్లో నేనెంత చేసినా ఏమీ చెయ్యటం లేదంటున్నాడు. నిజంగానే మానేస్తాను." ఇలా అనుకోగానే యేడుపొచ్చి యాడవటం మొదలు పెట్టాను. ఇంతలో మా నాన్నొచ్చి యిల్లు చిందరగా వుండటం, పొయ్యి మండకపోవటం చూసి సంగతేమిటని అడిగాడు. జరిగినదంతా చెప్పాను. అంతావిని మా నాన్న "అమ్మాయ్- ఆడవాళ్ళు ఎన్నడూ కుండల మీద అలగకూడదమ్మా. వంట చెయ్యి"

అన్నాడు. మళ్ళీ వంట మొదలుపెట్టా. కోపం మాత్రం తగ్గలా. ఐతే యిల్లు చిమ్మటం గుడ్డలుతకటం మానేశా. చిన్న పిల్లల ఉచ్చగుడ్డలు కూడా ఉతక్కపోవటంతో యిల్లంతా ఆ మురికి గుడ్డలతో నిండిపోయింది.

నా భర్త తిరిగొచ్చి ఈ భండాలం అంతా చూశాడు. కొడతాడేమో నని భయపడి పరిగెత్తి పారిపోటానికి సిద్ధపడ్డాను. అతను ఈ పనులన్నీ ఎందుకు చెయ్యలేదని అడిగాడు. "నేనే పనీ చెయ్యటంలేదని నువ్వే అన్నావుగా. వండటానికీ గుడ్డలుతకటానికీ వేరే మనిషిని తెచ్చుకో" అన్నాను. అతనేం మాట్లాడలా. "తిండి వుడకేశాలే. కానీ అదికూడా చెయ్యకుండా వుండాల్సింది" అన్నాను.

ఇలా ఓ వారం గడిచింది. నేనా ఉచ్చగుడ్డలు కూడా ఉతకటం లేదు. పాత గుడ్డలన్నీ అయిపోయాయి. ఇంటి వాకిలికి కట్టిన కర్టెన్లుచింపి పిల్లల ముడ్డికింద వేస్తున్నా. అట్లా చెయ్యటం నాకూ యిష్టంగాలేదు. బాగా భయం వేసింది. చంపేస్తాడనే అనుకున్నాను. కానీ అతను అర్థం చేసుకో వాలి అనే కోరిక నాలో బలంగా వుంది. ప్రతిరోజూ చాకిరీ చెయ్యటానికి ఎవరో ఒకర్ని తెచ్చుకోమనీ యింకొక్కరోజు కంటే ఎక్కువ వంట చెయ్యననీ చెప్పేదాన్ని.

ఇట్లా ఓ వారం భయంకరంగా గడిచింది. ఆ వారం నాకు నిద్ర కూడా లేదు. నిద్రపోతే అతనేం చేస్తాడోనని భయం. చివరికోరోజు నన్ను యింట్లోంచి బైటికి గెంటాడు. నేను యిట్లాగే ప్రవర్తిస్తే యిక యింట్లోకి రానవసరం లేదన్నాడు. ఆ రోజు నాకింకో ఆలోచన వచ్చింది. ఒకనోట్ పుస్తకం కొన్నాను. ఎందుకో తెలుసా? ప్రతిరోజూ నేను చేసే పనులన్నీ రాసి దానికెంత కూలిగిడుతుందో రాశాను. నెల మొదటినుంచీ ప్రతిరోజూ అంట్లు తోమినందుకూ, గుడ్డలుతికినందుకూ, వంట చేసినందుకూ అన్నిటికీ ఖర్చు రాశాను. రోజూ ఎన్ని అంట్లు తోమానో ఎన్ని గుడ్డలుతికానో ఎన్ని యిస్త్రీ చేశానో వివరంగా నెల పొడుగునా రాశాను.

నెలాఖరు వచ్చింది. నా భర్తా నేనూ పోట్లాడుకోవటం కాస్త తగ్గింది. మళ్ళీ యిల్లంతా పద్ధతిగా శుభ్రంగా వున్నందుకు సంతోషంగా ఉన్నాడు. 30వ తారీకున "దాన్ రేనే-ఇక యిప్పుడు లెక్కలు చూడాలి. నేనిన్ని రోజులు యిన్ని పనులు చేశాను. ఆ పనికిగానూ మొత్తం నువ్వింత యివ్వాల్సొస్తావు" అని చెప్పాను. ఆ మొత్తం 240 పిసో లయింది. నా భర్తకు నెలకు 80 పిసోల జీతం. మూడునెలల జీతమయితే

గాని నా వాటికి సరిపోదు. "నేనేమీ చెయ్యటంలేదని నువ్వన్నావు. నేనేం చేస్తున్నానో ఎంత చేస్తున్నానో చూపించాను. కానీ నన్ను నువ్వర్థం చేసుకోవటంలేదు" అన్నాను. ఈరకంగా నేనతనికి ఎంత సాయపడుతున్నానో చూపించి యింకా యితర విషయాలగురించీ సమస్యలగురించీ నాకుతెలుసుకోవాలని వుందని చెప్పాను. చివరకు మేమిద్దరం ఒక అంగీకారానికి వచ్చాం. అతను సినిమాలకూ షికార్లకూ వెళ్ళగూడదు. నేను మీటింగులకి వెళ్ళగూడదు నా భర్త నెలరోజులపాటు సినిమాకూడా వెళ్ళకుండా వున్నాడు. విసుగెత్తి పోయాడు. ఇంట్లో మూలుగుతూ వుండేవాడు. చివరకు ఒక శనివారం టౌనుకెళ్ళి రాత్రి బాగా పొద్దుపోయాక వచ్చాడు. తాగి వున్నాడు. నేనప్పటికి ఊరుకున్నాను. మర్నాడు ఆదివారం. రాత్రి నిషా దింపుకోటానికని బైటికి వెళ్ళి మళ్ళీ తాగొచ్చాడు. నేనేం మాట్లాడలేదు. అదివరకు తాగొచ్చినప్పుడల్లా గొడవ చేసేదాన్ని. ఈసారి అసలు మాట్లాడలేదు. అదతనికి ఆశ్చర్యంగా వుండి పదేపదే క్షమాపణలడిగాడు. నేనూ చాలా సామరస్యంగా ఫరవాలేదులెమ్మన్నాను. గురువారం రాగానే సాయంత్రం పిల్లల్ని తీసుకుని "రెనే, నాలుగు గంటలయింది. యూనియన్ మీటింగుకి పోతున్నాను. నువ్వు బైటికెక్కడికీ వెళ్ళకన్నావు. నేనూ మీటింగుల సంగతి మర్చిపోదామనుకున్నాను. అది మరి ఒప్పందంగదా. నువ్వు రెండుసార్లు బైటికెళ్ళావు. నేనూ రెండుసార్లు యూనియన్‌కి వెళ్తాను అన్నాను. అతనికది నచ్చలేదు. ఇద్దరం ఘోరంగా పోట్లాడుకున్నాం. నేను మాత్రం మీటింగుకి వెళ్ళాను.

ఆ రోజు కుండపోతగా వర్షం కురిసింది. మా మీటింగు పూర్తయినా యిళ్ళకు వెళ్ళలేక పోయినాం. నేను పిల్లలతో వెళ్ళాను గదా- నా భర్త మా కోసం దిగులుపడి గొడుగు తీసుకొని వచ్చాడు. అతనక్కడికి రాగానే మా ప్రెసిడెంటు అతన్ని లోపలికి పిలిచి ఈ మీటింగుల్లో మేమేం చేస్తామో చెప్పింది. మేం అల్లిన వస్తువులన్నీ చూపించి "మీ మగవాళ్ళకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. వచ్చేవారం మా మీటింగుకి మిమ్మల్ని పిలిచి ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్ని గురించి మాట్లాడమనాలని అనుకుంటున్నాం" అన్నది. నా భర్తకు ఏం చెయ్యాలో తెలియక మాట్లాడతానని ఒప్పుకున్నాడు.

మళ్ళీ గురువారం అతనే ముందు తయారై నన్ను తొందర పెట్టాడు. ఇట్లా మా ఆయన నన్నర్థం చేసుకున్నాడు. అప్పట్నుంచీ నే

చేసే ప్రతిపనిలో తోడుగావున్నాడు. నా యింట్లో జరిగిన ఈ యుద్ధంలో నేను జయించ గల్గాను. ఐనప్పటికీ మన పోరాటం మన భర్తల మీది పోరాటంగా దిగజారకూడదని నేను చెప్పాలనుకుంటున్నా. ఈ వ్యవస్థ వాళ్ళను స్త్రీలను చిన్నచూపు చూసేవారిగా తయారు చేస్తోంది గనుకనే వాళ్ళట్లా ప్రవర్తిస్తున్నారు.

ఆ నాటి నుంచీ నా మూలానా నా పనుల మూలానా నాభర్త ఎన్నో కష్టాలో పడాల్సి వచ్చింది. అతన్ని కొట్టారు. జైల్లో పెట్టారు. అతనిపై అధికారులు పనిలో వేధించారు. వాళ్ళు చేసిన ఒకపని చెబుతాను. గనిలో పనిచేసే కార్మికులెవరూ యిండ్ల దగ్గర్నించి భోజనం తెచ్చుకోరు. గుమస్తాలు మాత్రమే తెచ్చుకుంటారు. నా భర్తను చిక్కుల్లోపెట్టాలని కంపెనీ వాళ్ళు అతన్ని మాత్రం యింటి దగ్గర్నించి భోజనం తెచ్చుకోమన్నారు. "నీ భోజనం 8½ గంటలకింకా యిక్కడుండాలి" అన్నారు. 9 గంటల 25 నిమిషాలకు ఆఫీసరు వచ్చి నా భర్తతో "ఏది నీ భోజనం? నీ పెళ్ళాం యూనియన్‌కి పోతుందే వంటెవరు చేస్తారు? నీ పెళ్ళాం చేత వంట చేయించకుండా మీటింగులకి తిప్పుతున్నావేం" అని దబాయించారు.

సంతోషించాల్సిందేమంటే చివరకు ఆఫీసర్లు కూడా స్త్రీలు బైటికి రావాల్సిన అవసరాన్ని గుర్తించారు. మొన్నిమధ్యే ఒక ఆఫీసరు నా భర్తతో "నన్ను మన్నించాలి చంగారా, నీ భార్యచేసే పనెంత ముఖ్యమయిందో నాకు తెలియక అలా అన్నాను" అన్నాడు. ఎందుకట్లా మాట్లాడాడు? అతని ఉద్యోగానికే ఎసరొస్తే మేం స్త్రీలం సమ్మె చేసి అతని ఉద్యోగం ఊడకుండా చేశాం.

కామ్రేడ్స్-ఎన్నో సమస్యలుంటాయి. ఆ సమస్యలన్నీ స్త్రీలను బైటికి రాకుండా అడ్డుకోవాలని చూస్తాయి. ఎందుకు? ఎందుకంటే మనం ఏ పని చేసినా దాని అంతు చూసేదాకా వదలం. మన కామ్రేడ్లకు ఎంతో సహాయ పడతాం. మనం యూనియన్లో చురుగ్గా పాల్గొనక ముందు కూడా మన భర్తలకు యూనియన్ వుండాలనీ, వాళ్ళు రాజకీయ పార్టీలో పని చేయాలనీ వాళ్ళకు మనం సహాయ పడాలనీ మనకు తెలుసు. దానివల్ల మన కార్మికులకు మేలు జరిగింది. పెట్టుబడిదారుల నుండి విముక్తి కోసం మనం చేసే పోరాటాలకు మేలు జరిగింది. కానీ మనం స్త్రీల తరఫున మగవాళ్ళతో పోట్లాడితే దానివల్ల పెట్టుబడిదారులే లాభపడే వాళ్ళు! మగవాడికి స్త్రీల సహాయం అవసరం లేదని చెప్పి స్త్రీ- పురు

షంను విడదీసి కలిసి పోరాటం చేసే అవకాశం లేకుండా చేస్తారు పెట్టుబడిదారులు. స్త్రీ విముక్తి వుద్యమాన్ని స్త్రీలు పురుషులపై దాడిచేసేలా పెట్టుబడిదారులే ఉపయోగించుకుంటున్నారు.

ఒకసారి యూనియన్ మీటింగులో అంతా పడుచువాళ్ళే వున్నారు. నేనూ మరీ ముసలిదాన్ని కాదుగదా. ఒక నాయకుడు నా దగ్గరకువచ్చి "పాటీ బాగున్నావా ? అలా వెళ్ళి ఏదైనా తాగుదామా ?" అంటూ నా భుజాల చుట్టూ చేతులు వెయ్యబోయాడు అందరూ చూస్తుండగానే. నేను వెంటనే లేచి మాట్లాడాను "సెక్రటరీ గారూ ! ఈ మనిషికి యూనియన్ అంటే దేవాలయంలా పవిత్రమైనదని అర్థమయ్యేలా చెయ్యండి. మనం అందరం మన బాధలను కలబోసుకోటానికి యిక్కడకు వచ్చాం. ప్రజలకోసం పోరాటం చెయ్యటానికి వచ్చాం. ప్రియులను వెదుక్కోటానికి కాదు. మమ్మల్ని - స్త్రీలను అంతనీచంగా చూసినందుకు ఈ మనిషిని శిక్షించమని అడుగుతున్నాను" అన్నాను. అప్పటి నుంచీ వాళ్ళు మమ్మల్ని ఎంతో గౌరవంగా చూశారు. వాళ్ళ గౌరవాన్ని పొందేలా మేం ప్రవర్తించాం.

కొందరు యువతులంటారు. వాళ్ళు తాము నాయకులైతే చాలు భార్యగా తల్లిగా గృహిణిగా తమకున్న బాధ్యతల్ని గురించి పట్టించుకో నవసరం లేదనుకుంటారు. నాయకులవగానే భార్యనూ పిల్లలనూ పట్టించుకోని పురుషులను ఆదర్శంగా పెట్టుకుని వాళ్ళలా తయారవుతారు. కానీ నాయకులమైన స్త్రీలం మిగిలిన వాళ్ళకన్నా యింకా బాగా పనిచేసి మిగిలిన స్త్రీలకు ఆదర్శంగా ఉండాలి. అలాగే నా పనిలో సహాయపడమని భర్తను డిమాండ్ చెయ్యాలి. ఇంటిపని యింటిలో అందరూ కలిసి చెయ్యాలి అనే భావం భర్తకూ పిల్లలకూ అర్థమయ్యేలా మనం చెప్పాలి. నా సంఘంకోసం నా కుటుంబం కోసం కూడా నేను పని చెయ్యాలి. నేను మరుసటిరోజు నాయకురాలిగా ఒక కార్యక్రమానికి పోవాల్సివుంటే ఈ రాత్రికే బట్టలుతుక్కోని మర్నాటి వంటకు అంతా సిద్ధం చేసుకుని వుండాలి.

**పోరాటంలోని అనుభవాలు**

ఈ 15 సంవత్సరాల్లో గనుల ప్రాంతంలో ఎన్ని సమస్యలున్నా మేం ఎన్నో అనుభవాలద్వారా ఎన్నో విషయాలు నేర్చుకోగలిగాం. ఆ అను

భవాలను కొన్ని మీకు చెబుతాను. దానివల్ల మీకు ఏ మార్గాన ప్రయాణం చెయ్యాలో తెలియవచ్చు.

అన్నింటికంటే ముఖ్యమైనది సంఘం. ప్రజలు సంఘంలోకి వస్తే వాళ్ళు స్పందిస్తారు ఐక్యత వుంటే సాధించలేనిది లేదు. ప్రజలకు సంఘం లేకపోతే, సరైన అవగాహన లేకపోతే వాళ్ళేమీ సాధించలేరు. ఒక్కొక్కసారి మితిమీరిన ఉత్సాహం అపజయాన్నే తెస్తుంది. అదెలాగో చెబుతాను.

ఓటమి :- మా హాస్పిటల్లో మందులు లేవు. గృహిణుల సంఘం కాంపోల్ కంపెనీకి 48 గంటల్లోగా మందులు పంపాలని నోటీసు యిచ్చింది. అలా పంపకపోతే మేం పనిలోకి దిగుతాం అని హెచ్చరించింది. ఆ కంపెనీ ఏమీ పట్టించుకోలేదు. మేమూ యిక సమయం వృధా చెయ్యకూడదని సైగ్లో 20కి వెళ్ళే రోడ్లమీద రాకపోకలు బంద్ చేశాం. ఇలా వారం గడిచేసరికి రొట్టే మాంసం అయిపోయాయి. కార్మికులు కంపెనీ వాళ్ళనడిగితే "మీ ఆడవాళ్ళు దారికడ్డం కూచుంటే మేమేం చేస్తాం ? కిలోమీటరు దూరంలో మూడు లారీల మాంసం కుళ్ళిపోతోంది" అన్నారు. పంచదారా పిండీ కూడా లారీల్లోనే వుంది. అప్పుడే వర్షం కురవటంతో అన్నీ తడిసి ముద్దయ్యాయి. పనికి రాకుండా పోయాయి. మేం తిన్నదేమీ లేకపోయినా కంపెనీ మటుకు వాటికి డబ్బు చెల్లించాల్సి వచ్చింది. మేం సరిగ్గా చేస్తున్నాం అనుకున్న పనులే మాకు ఎదురు తిరిగాయి. అంతా గందరగోళమయిపోయింది.

కార్మికులేమన్నారూ? వాళ్ళు మేం చేసిన పనికి తిన్నసంతపని చేశారు. మేం పొరపాటు చేశాం నిజమే. కానీ మా కార్మికులే మమ్మల్ని అర్థం చేసుకోలేదు. నేనేడుస్తూ యింటికెళ్తూ "నేనింకెప్పుడూ సంఘంలోకి వెళ్ళను. మేం ఎంతో త్యాగం చేశాం. రాత్రింబగళ్ళు పిల్లలేడుస్తున్నా పట్టించుకోకుండా తిరిగాం. రోడ్డుకి కాపలా కాశాం. ఐనా కార్మికులు మమ్మల్ని నానా మాటలని తిట్టిపోయారు. వాళ్ళ బాధ వాళ్ళే [illegible] నేనెందుకి పోతున్నాను" అనుకున్నాను. కోపంగానే యింటికెళ్ళాను. మేం తీసుకున్న చర్యలు మా కార్మికులకే వ్యతిరేకమని మాకు తెలియలేదు. మంచి చెయ్యాలనుకుని యింతా దారుణమైన పరిస్థితుల్లోకి వెళ్ళాం.

కనుక ముందు మనం సంఘటిత పడాలి. ప్రతి పట్టణంలోనూ ప్రజలు బూర్జువాలకూ, పెట్టుబడిదారులకూ ప్రభుత్వానికీ వ్యతిరేకంగా

పోరాడుతూనే వున్నారు. కానీ ఆ పోరాటంలో ఏ పద్ధతుల్ని అవలంబిం చాలో మనందరం కలిసి ఆలోచించాలి. తర్వాత ఫలితాలెలా వుంటాయో, దానికి మనం ఏం చెయ్యాలో కూడా ఆలోచించాలి. ఎప్పుడేం జరుగు తుందో మనకు తెలియదు. హఠాత్తుగా వాళ్ళు మనల్ని హింసించటం మొదలు పెడతారు. తర్వాత సైన్యం వస్తుంది. అందుకే ప్రజలందరూ సంఘటిత పడటానికి సిద్ధంగా వున్నారా సహకారాన్ని యిస్తారా అన్న విషయాలు మనం తప్పక తెలుసుకోవాలి. అందుకు సంఘం అతి ముఖ్యం.

మేం చేసిన పనులన్నీ అపజయం పొందలేదు. సైగ్లో 20 లో 1978 ఎన్నికల తర్వాత జరిగిన ఒక సంగతి చెబుతాను.

ప్రభుత్వం మాకు మాంసం, బియ్యం, సబ్బులూ, మైదం మొదలైన వన్నీ పంపటం మానేసింది. నెలంతా మాకి వస్తువులేవీ రాలేదు. గృహి ణుల సంఘం సమావేశమై నేను వెళ్ళి కొమిబోల్ డైరక్టరుతో మాట్లాడా లనీ వాళ్ళు పట్టించుకోకపోతే కార్యక్రమంలోకి దిగాలనీ అనుకున్నాం. సహజంగానే వాళ్ళు పట్టించుకోలేదు. పదిహేను మందిమి కలిసి ఏం చెయ్యాలా అని ఆలోచించాం. కొందరికి పాత ఆలోచనే వచ్చింది. రోడ్లు బందుచేసి షాపులు మూయించాలని అన్నారు. ఐతే దానివల్ల మా వాళ్ళకే నష్టం అని మాకు తెలిసింది. మా భర్తలు సమ్మెచేస్తే జీతాలురాక మళ్ళీ మాకే యిబ్బందవుతుంది.

మరి మేమేం చెయ్యాలి? ఆ రోజు 80 టన్నుల మినరల్స్ 20 లారీల్లో వెళ్తున్నాయని తెలిసింది "మనం వెళ్ళి ఆ లారీలను ఆపాలి" అన్నాను నేను. ఇది కంపెనీకి పూర్తి వ్యతిరేకం. కొమిబోల్ ఆ లారీలను ఖచ్చితంగా సరైన సమయానికి పంపితీరాలి. సమయానికి పంపకపోతే కాంట్రాక్టు చెడిపోతే కంపెనీకి చెడ్డపేరొస్తుంది.

మర్నాడు కొందరు స్త్రీలం గుంపుగా లారీలున్న చోటికి వెళ్ళాం. కొన్ని అప్పుడే బయల్దేరుతున్నాయి. కొన్ని లారీల డ్రైవర్లు మమ్మల్ని చూడనట్లు నటించారు. మేం వెళ్ళిపోవాలని వాళ్ళ కోరిక. కానీ మేమె ప్పుడూ కాస్త అతిగా వుంటామంటారు గదా—అందుకనే కొన్ని డైనమైట్ కర్రలు మాతోపాటు తీసికెళ్ళాం. ఒక లారీలో ఎక్కి డ్రైవరుతో "నువ్వు లారీ నడిపితే మేమీ డైనమైట్ కర్రలు పేల్చేస్తాం సర్వం నాశన మవుతుంది" అన్నాం. "అబ్బెబ్బే మేం దిగిపోతున్నాం" అని తొంద

రగా లారీ దిగి వచ్చాడు. మేం లారీలను కదలనియ్యకుండా వంతులు వేసుకు కాపలా కాశాం. కొంతరు ఉదయం ఏడింటి నించీ మధ్యాహ్నం మూడింటి వరకూ లారీల దగ్గర వుండే మిగిలిన వాళ్ళు వాళ్ళకు భోజనం వండి వాళ్ళ పిల్లలను చూశారు. తర్వాత వాళ్ళు యిళ్ళకు వస్తే మిగిలిన వాళ్ళు వెళ్ళి రాత్రి పదకొండు వరకూ కాపలా కాశారు. ఇంకో జట్టు రాత్రి 11 నుంచీ ఉదయం ఏడు వరకూ కాపలా వున్నారు.

మనం ఏదైనా సాధించాలంటే సంఘటిత పడాలి. ప్రతి ఒకరూ ఆ పనిలో పాల్గొనాలి. అలా చెయ్యకపోతే ఓడిపోతాం. మేం ఒక వారం యిలాగే చేశాం. మొదట డైరక్టరు మమ్మల్ని చూసి నవ్వాడు. తర్వాత రాత్రిళ్ళు కూడా మేం లారీలను వదలక అక్కడే పరుచుకోవటం చూసి చికాకుపడ్డాడు. మమ్మల్ని ఆ ప్రయత్నంనుంచి మళ్ళించటానికి ఆహారం తెచ్చానని చెప్పాడు. సైగ్లో 20కో రెండు షాపులున్నాయి. ఒకటి పెద్దది. ఇంకొకటి చిన్నది. ఆ చిన్న షాపునిండా ఆహారం నింపాడు. అక్కడ మీకు కావలసినంత ఆహారం వుందని చెప్పాడు. గృహిణులు వెళ్ళి చూశారు. నిజంగానే ఆహారం వుంది, కానీ నేను కూచుని ఆ షాపులో పదార్థాలు ఎన్ని రోజులకు సరిపోతాయో లెక్కగట్టాను. అంతా కలసి ఒక్కరోజుకి సరిపోయే ఆహారమే అక్కడుందని తేలింది.

మమ్మల్ని వాళ్ళు మోసం చెయ్యాలని చూశారు. మేం లారీలను ఆపటం మానలేదు. డైరక్టరు ఆశలు వదులుకున్నాడు. కాగితం రాసి సంతకం పెడతానన్నాడు. మేం అందరం మాట్లాడుకుని చెబుతాం అన్నాం. వారమయ్యాక ఒక అర్ధరాత్రి ఒక కాగితం తీసుకుని డైరెక్టరు మా దగ్గరికి వచ్చాడు. మేము "మన్నించండి. మేం ఈ సమస్యల గురించి ఆఫీసు వేళల్లోనే మాట్లాడుతాం. ఇప్పుడు మేం విశ్రాంతి తీసుకుంటున్నాం" అని చెప్పి నిద్రపోయాం. మరి ఆ డైరక్టరు మాతో ఎప్పుడూ అలాగే మాట్లాడతాడు. మేం వస్తున్నానరే యిందిపద్ద మాతో మాట్లాడడు. "ఆఫీసు వేళల్లో అక్కడే కలుసుకోండి" అంటాడు. మీరు రాసుకొచ్చిన కాగితం అందరం చదివాకనే నిర్ణయం తీసుకుంటాం అని చెప్పాము.

ఉదయం ఆరుగంటలకు డైరెక్టరు రేడియోద్వారా గృహిణులసంఘ సభ్యుల్ని సమావేశానికి పిలిచాడు. యూనియన్ నాయకులు కూడా వచ్చారు. ఒక ఒప్పందానికి రావాలనుకున్నాం. దీనికి ముందు ఒక ప్రెస్ మీటింగు జరిగింది. అందులో కామ్రేడు "ఈ డైరెక్టరు రాసుకొచ్చిన దాని

వల్ల యిసుమంత లాభంలేదు. ఇతను కొమిబొల్ చేతిలోని పావు. ఈ డైరెక్టరు చెప్పిన దాన్ని ఒప్పుకుంటామని లాపాజ్ వాళ్ళు హామీ యివ్వాలని" చెప్పారు. లాపాజ్‌లో ఒప్పుకోవటంతో మధ్యాహ్నం మూడింటికి లారీలని వదిలాం.

ఈ సారి మనం గెలిచాం. ఈ సారి మనం ప్రజలకు వ్యతిరేకమైన పనిగాక ప్రభుత్వానికి వ్యతిరేకమైన పని చేశాం. బాగా సంఘటితపడి పని చేశాం. అందుకే గెలిచాం. మన-దరం కలిస్తే మన శత్రువుని పెద్ద దెబ్బ తీయగలుగుతాం. మనం ఐక్యం కాకుండా ఎవరిష్టం వచ్చినట్లు వారు చేస్తే ప్రజా వ్యతిరేకులం అవుతాం.

సంఘటిత పడటం తేలికకాదు. మీరు నమ్మరేమో గానీ సైగ్లో 20 లో కూడా యింకా సంఘాన్ని వ్యతిరేకించేవారూ, ఎంతో ఒత్తిడిచేస్తే తప్ప ముందుకు రానివారూ ఉన్నారు. బన్‌జేర్ అధికారంలోకి రాగానే రొట్టె ధర పెంచాడు. దానికి వ్యతిరేకంగా మేం ఒక ప్రదర్శన చేశాం. మమ్మల్ని శిక్షించటానికి ప్రభుత్వం అన్ని షాపులనూ మూసేసింది. పిల్లలకు పెట్టటానికి కూడా మా వద్ద ఏమీ లేదు. గృహిణుల మంతా సమావేశమై కంపెనీకి ఉత్తరం రాయాలనీ, వాళ్ళు పట్టించుకోక పోతే సమ్మె చేయాలనీ నిశ్చయించుకున్నాం. వాళ్ళకో రోజు గడువు యిచ్చాం. తర్వాత ప్రదర్శన కోసం మా కామ్రేడ్లను పిలిస్తే పదిమంది కూడా రాలేదు. సమ్మె చేస్తామని డైరెక్టర్ని బెదిరించి పదిమందితో ప్రదర్శన ఎట్లా చెయ్యటం?

అప్పుడు మేం ఏం చేశామో తెలుసా? ఆ వచ్చిన పదిమందిమీ కలిసి స్టోరుకి తాళం వేసేశాం. నేను ప్రెస్ వాళ్ళను పిలిచి రేడియోలో మాట్లాడాను. "మా కామ్రేడ్లకు ఆహారం అక్కర్లేదు. అందుకే వాళ్ళు యిళ్ళనుంచి బైటికి రాలేదు. మేం యిక్కడికి వచ్చిన వాళ్ళం, రాని వాళ్ళకు ఆహారం అవసరమయ్యేంత వరకూ స్టోరుకి తాళం వేసే వుంచుతాం. మేం యిక్కడే స్టోరు లోపలే మా పిల్లలతో సహా ఎంతకాలమైనా వుంటాం" ఇలా చెప్పేసరికి ఒంటిగంటకల్లా పిల్లలతో సహా ఆడవాళ్ళంతా వచ్చేశారు. చాలా మందిమి డైరెక్టరు దగ్గరికి వెళ్ళాం. అతను మేం చెప్పేది వినలేదు. జనం ఎంత పట్టుదలతో వున్నారంటే అర్ధరాత్రయినా ఎవరూ ఆఫీసుదగ్గర్నించి కదల్లేదు. పిల్లలు కూడా తిండిలేకుండా అక్కడే తిరుగుతున్నారు. మేం డైరెక్టరు గది దగ్గర్నించి కదల్లేదు.

అతన్నింటికి వెళ్ళనీయ లేదు. అతను భోజనం కూడా చెయ్యలేదు. మా భర్తలు భోజనం చేస్తున్నారా? చివరకు అతనికి కాఫీ కూడా పంపనివ్వ లేదు. అతను మాతో ఒప్పందానికి వచ్చి రొట్టె ధర తగ్గించేవాకా అట్లాగే వున్నాం. తెల్లవారు ఝాము ఒంటిగంటకు యిళ్ళకు వెళ్ళాం. అంతసేపు యింటికి రానందుకు కొందరు కార్మికులు భార్యల్ని కొట్టారు. "నువ్వు నా పెళ్ళానివి రాజకీయ నాయకురాలివి కాదు. పిల్లల్ని వదిలి తిరుగుతావా..." యిట్లా తిట్టారు. మమ్మల్ని అట్లా గౌరవించారు. ఆ ఆడవాళ్ళు మర్నాడు ఉదయం నాకి సంగతి చెప్పగానే నేను రేడియోలో మాట్లాడాను "కామ్రేడ్స్ దురదృష్టవశాత్తు మనం చేసిన పని జాతీయవాదులకీ, బెన్‌జెరిస్టులకూ నచ్చలేదు. ధరలు కొంచెంగా తగ్గినందుకు వాళ్ళు వారి భార్యలను కొట్టారు. ఇంకోసారి వాళ్ళ పేర్లన్నీ చెబుతానని అన్నాను. దాంతో వాళ్ళు వాళ్ళ భార్యల్ని బైటికి పోవద్దని బతిమాలుకున్నారు. బైటికిపోతే దెబ్బలు అందరికీ కనపడి వాళ్ళపేర్లు తెలిసిపోతాయని భయపడ్డారు. కానీ చాలామంది వాళ్ళను గుర్తించారు. "నువ్వు నీ భార్యను కొట్టావు గదా" అని అడగటం మొదలు పెట్టారు. వాళ్ళు మా ఆయన దగ్గర కొచ్చి "బంగారా-మీ ఆవిడని మామీద బురద జల్లటం తగ్గించమని చెప్పు, మరీ ఎక్కువ చేస్తోంది" అన్నారు.

ఇదంతా మీకు చాలా వివరంగా చెప్పాను. ఎందుకంటే అంతా సవ్యంగా ఏలోటూ లేకుండా నడుస్తోందని మీరనుకోకూడదని అలా చెప్పాను. కొన్నిసార్లు మనవాళ్ళే మనకు వ్యతిరేకులవుతారు. మనల్ని అర్థం చేసుకోరు. పనిలేనపుడు ఉత్సాహంగా వుండి పని సమయానికి జారుకుంటారు. అందుకే సంఘం ముఖ్యమని నేను పదేపదే చెబుతున్నాను. భర్త ఆటంకపెట్టకపోతే ప్రతి స్త్రీ స్వేచ్ఛగా సమ్మెల్లో ఆందోళనల్లో పాల్గొంటే మనం ఏమైనా సాధించగలుగుతాం. అట్లాకాకపోతే ఏమీ చెయ్యలేం. మనం జారిపోకుండా ఆత్మవిశ్వాసంతో వుండాలి.

## *కార్మికవర్గ స్త్రీలంగా మనం ఎట్లా పోరాడాలి?*

### 1. మనం పోరాటంలో పట్టుదలతో నిలబడాలి

మన పిల్లల భవిష్యత్తనే అతిముఖ్యమైన విషయం కోసం మనం

పట్టుదలతో వుండాలి. అందుకే మనం పోరాడుతున్నాం చైతన్యవంతులమవుతున్నాం బలపడుతున్నాం. కొందరు నన్నడుగుతుంటారు "దొమిటిలా ఎన్నో బాధలు పడ్డావు. ఇకనైనా ఆ సంఘంలోనుండి బైటికి రాకూడదూ? దాని మూలాన నీకేం వొరిగింది అని. నా సొంత విషయాలు చెబుతున్నందుకు మన్నించండి నేను ఎవరికోసం పోరాడానో వారేనన్ను విమర్శించి నిందించి చివరకు దొంగ అని కూడా అన్నారు. ఇటువంటివి విన్నప్పుడు ఎంతో నిరాశ కలుగుతుంది. అన్నిపనులూ మానేద్దామనిపిస్తుంది. కానీ మనం మన వాళ్ళ కోసం మన పిల్లల కోసం వాళ్ళ భవిష్యత్తు కోసం మనలాగా వారు బాధలు పడకుండా వుండటం కోసం పోరాడుతున్నామని గుర్తుపెట్టుకుంటే మనకు నిరాశ కలగదు. నీరసం రాదు. కానీ అదంత తేలికైన విషయం కూడా కాదు.

మన పోరాటం కేవలం పంచదారకోసమో మైనపు వొత్తులకోసమో కాదు. అది అసలు సమస్యను పరిష్కరించదు. ఉదాహరణకు మనం మాంసంకోసం పోరాడాం. మాంసం వచ్చింది. బియ్యం కరువైతే సాధించుకున్నాం. మందుల కొరత యింకావుంది. సైగ్లో 20 లో షాపుల నిండుగా సరుకులున్నాయి మన దగ్గర కొనటానికి డబ్బు లేకపోవటంతో. బైటి నుంచి వచ్చిన ఎవరైనా ఆ దుకాణం చూస్తే "ఈగని కార్మికులకన్నీ మస్తుగా దొరుకుతున్నాయని అనుకుంటారు. నేనా దుకాణాన్ని "ఆహారపు దబ్బాల మ్యూజియం" అంటున్నాను. ఆహారపు దబ్బాలు అక్కడ సంవత్సరాల తరబడి ఎండిపోతూ వుండిపోతున్నాయి. కాబట్టి సమస్యలను పరిష్కరించుకునే పద్ధతి యిదొక్కటే కాదు.

## 2. మనం పురుషులతో కలిసి పోరాడాలి

పురుషులకు ఎన్నో సమస్యలుంటాయి. అతనొక్కడే పోరాటం చెయ్యలేడు. కొన్నిసార్లు అతనే విషయాలూ పట్టించుకోలేడు. మనం చెయ్యాల్సింది చాలావుంది. అది అనేక పద్ధతుల్లో పురుషుల కర్థమయ్యేలా చెయ్యగలం. కానీ ముఖ్యమైన విషయం యేమిటంటే వారినుంచి మనం వేరుపడకూడదు. అగిలార్ చేసిన మంచిపని నా భర్తను మీటింగులో మాట్లాడమని ఆహ్వానించటం. అప్పటినుంచీ ఆయనా నేనూ కలిసే పని చేశాం. నేనేం చేస్తున్నానో ఎక్కడికి వెళ్తున్నానో ఆయనకు తెలుసు ఆయనకు నాపై నమ్మకం వుంది. కొన్ని మీటింగులలో నేనొక్క దాన్నే

స్త్రీని. మిగిలిన వాళ్ళంతా పురుషులు. అలాంటప్పుడు కూడా ఆయన నమ్మరాదు. మిగిలిన కామ్రేడ్లు నన్ను గౌరవిస్తారు.

క్రమంగా ఈ అడ్డంకులూ, కట్టుకథలూ, విమర్శలూ తగ్గిపోతున్నాయి. ఇవన్నీ పెట్టుబడిదారులు మనల్ని అణిచి వుంచటానికి మనపై రుద్దారు. మనం ఎంత అజ్ఞానంలో వుంటే మన విముక్తి అంత ఆలస్యమవుతుంది.

## 8. మనం కొత్తపనులు నేర్చుకోవాలి

మనం అవిద్యా అజ్ఞానంలో వుంటే మన పిల్లలు కూడా అజ్ఞానంలో పెరుగుతారు. మనకు మగపిల్లలుంటే మనం వాళ్ళచేత యింటిపని చేయించం. వీధులో తిరగటం మాత్రమే నేర్పుతాం. ఆడపిల్లలయితే- "నువ్వు ఆడపిల్లవు- పనులన్నీ నేర్చుకొని వుండాలి. ఇంటిపనులు రాకపోతే ఆడపిల్ల ఎందుకు పనికొస్తుంది" అంటాం. ఇలా పెంచుతాం మనం మన పిల్లల్ని. ఇట్లా పిల్లల్ని పెంచటం అంటే పెట్టుబడి దారులకు సహాయ పడటమే. అందుకే మనం అనేక విషయాల్ని నేర్చుకుని తీరాలి. పిల్లల్ని పెంచేది మనం గనుక మగవాళ్ళకంటే ఎక్కువ జ్ఞానాన్ని మనం సంపాదించాలి. నేను చదువుకోలేదు. అందువల్ల నా పిల్లలకు చదువులో ఏమీ చెప్పలేను. పుస్తకాలలో వాళ్ళకేదైనా అర్థంకాక నా దగ్గరకొస్తే నేను తెల్లమొహం వెయ్యాల్సిందే. వాళ్ళు సామాన్యంగా వాళ్ళ నాన్ననడిగే సాహసం చెయ్యరు. మగవాళ్ళు యింటికి వచ్చేసరికి అలసిపోయి రకరకాల సమస్యలతో విసిగిపోయి వుంటారు. పిల్లలేదైనా అడిగితే వాళ్ళు ఆ విసుగులో కొట్టినంత పనిచేస్తారు. పిల్లలు భయపడతారు. అందుకే మనమే ఆ బాధ్యత కూడా తీసుకోవాలి. మన పిల్లలకోసం మనం చదువుకోవాలి. మన పిల్లలు పెట్టుబడిదారుల చేతుల్లో మోసపోకూడదనుకుంటే మనం చదువుకుని తీరాలి.

"అమాయకుల్ని రొట్టెముక్కలో సగం యిచ్చి బుట్టలో వేయవచ్చని" వాళ్ళు అనరూ? మన సమస్యలన్నిటినీ మన పిల్లలతో చెప్పుకోవాలి. చిన్నపిల్లలు వీళ్ళకేమీ అర్థంకాదు అని అనుకోకూడదు. ఈపిల్లలు మనం నేర్చుకున్న విషయాలేగాక యింకా ఎక్కువ నేర్చుకోవాలి అనుకోవాలి. మనం చచ్చిపోయాక మన పోరాటాన్ని అందుకునేది మన పిల్లలే గదా.

సైగ్లో 20లో రెండు కుటుంబాల గురించి చెబుతాను. ఆ రెండు కుటుంబాలలోనూ ఇద్దరు తండ్రులూ సాన్‌జువాన్ హత్యాకాండలో చంపబడ్డారు. అందులో ఒకాయనకు ఎనిమిది మంది పిల్లలు. అతని భార్య ఆ ఎనిమిది మంది పిల్లలూ ఆకలితో ఏడుస్తున్నపుడూ, బూట్లు కావాలని పేచీ పెడుతున్నపుడూ "బాగా ఏడవండి. మీ నాన్నను చంపినవాళ్ళకు మీ ఉసురు తగలాలి. వెళ్ళి పోలీసుల్నే అన్నం కావాలనీ బూట్లు కావాలనీ అడగండి. సైన్యం దయవల్ల మీకు తండ్రిలేకుండా పోయాడు. పోయి వాళ్ళనే అడగండి" అంటూ అరిచేది.

ఈమె చదువుకున్నది కాదు. ఆమె భర్త ఆమెనెన్నడూ బైటికి రానీయలేదు. ఐనా ఆమెకు తన భర్త చావుకు కారణమెవరో తెలుసు. వాళ్ళమీద కసితో పిల్లలకు ఉగ్గుపాలతో పోసిపెంచింది. వాళ్ళిపుడు మంచి నాయకులుగా తయారయ్యారు.

ఇంకొకాయన భార్య చనిపోయిన భర్త గురించి పిల్లలకేమీ చెప్పేది గాదు. వాళ్ళ నాన్నని ఎందుకు ఎవరు చంపారో వాళ్ళకు తెలియదు. వాళ్ళిప్పుడు పోలీసు ఏజెంట్లుగా మారి ఎవరు వాళ్ళ నాన్నను నానా హింసలూ పెట్టి చంపేశారో ఎవరు వాళ్ళకు అజ్ఞాత శత్రువులో వాళ్ళకు సహాయపడుతున్నారు. తల్లికి పిల్లలను ఎలా పెంచాలో తెలియనప్పుడు యిలాగే జరుగుతుంది.

కొందరు పెద్ద విప్లవకారులూ, నాయకులూ కూడా స్త్రీలు ఉద్యమాలలోకి రానవసరం లేదంటారు. ఇంటికి ఒక విప్లవకారుడుంటే చాల్లే అంటారు. ఆ విప్లవకారుడు చనిపోతే అతని భార్యకు ఏం చెయ్యాలో తెలియదు. చాలాసార్లు ఆమె తన భర్త స్థానాన్ని కాపాడక పోగా ద్రోహం చేసే దానిగా తయారవుతుంది. నిర్బంధ సమయాల్లో మనం తరచుగా యిటువంటి సంఘటనలు చూస్తుంటాం.

ఒక రాజకీయ పార్టీలో పనిచేస్తున్న నా బంధువొకాయనవున్నాడు. ఆ రాజకీయ పార్టీ స్త్రీలుకూడా ఉద్యమాలలో పనిచెయ్యాలనే అంటుంది. కానీ మా బంధువు మాత్రం ఇంటికొక విప్లవకారుడు చాలులే అనేవాడు. ఒకరోజు అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. అతను తానెప్పుడో చిన్నతనంలో పార్టీలో పని చేశానని, పెళ్ళయ్యాక ఆ గొడవలన్నీ మానేసి యేమీ పట్టించుకోకుండా యింట్లోనే వుంటున్నాననీ చెప్పాడు. పోలీసులు అతని పార్టీలోని కొందరి గురించి వివరాలు చెప్పమని అడుగుతున్నారు.

మా బంధువు భార్య భర్తను వదిలిపెట్టమని అడగటానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. నా భర్తకే పాపమూ తెలియదంది. ఆ పోలీసులు "నిజమే కావచ్చు. కానీ ఫలాన వ్యక్తి నీ భర్త స్నేహితుడు. అతనే నీ భర్త కరపత్రాలు పంచాడని చెబుతున్నాడు మేమేం చేస్తాం" అంటూ అతని స్నేహితుడిదే తప్పని మాట్లాడారు. ఇకప్పుడామె వాళ్ళను తిట్టటం మొదలు పెట్టింది. "అబద్ధాలకోర్లు దుర్మార్గులు అన్నీ అబద్ధాలే. నా భర్తకేమీ తెలియదు. ఫలానా ఫలానా వాళ్ళే మా యింటికి వచ్చి అన్నీ చెబుతుంటారు. వాళ్ళే ముఖ్యులు" అని అందరిమీద చెప్పేసింది. పోలీసులు ఆమె మాటల్ని టేపుచేసి ఆమె భర్త దగ్గరకు వెళ్ళి "నీ కేదీ తెలియదని చెబుతున్నావు. నీభార్య మాటలువిను. ఎవరెవరు మీ యింటికి ఎప్పుడెప్పుడొచ్చారో. మీ యింట్లో ఎన్ని మీటింగులు జరిపావో నీకే తెలుస్తుంది" అన్నారు.

ఆవిడ తన భర్తకు ద్రోహం చేస్తున్నానని తెలియకుండానే ద్రోహం చేసేసింది. ఆమె తన భర్తతో కలిసి పార్టీలో పని చేసినట్లయితే యిలా జరిగుండేది కాదు. నాకేమీ తెలియదని భర్త చెబుతున్న మాటలను ఆమె కూడా సమర్థించి సహాయపడగలిగేది. తర్వాత మా బంధువు విడుదలయ్యాడు. భార్యను పట్టుకు తన్నటానికి తయారయ్యాడు. నేను వెళ్ళి "అది ఆమె తప్పుకాదు ఆమె బైటికి రాకుండా ఆమెకేవిషయమూ తెలియకుండా చేసింది నువ్వు" అని చెప్పాను. చివరికతను అర్థంచేసుకున్నాడు. ఇప్పుడు ఆమె కూడా పార్టీలో పని చేస్తోంది.

పురుషులు చైతన్యంతో వున్న స్త్రీలను చూసి అసూయపడకూడదు. స్త్రీలు పురుషుల్ని శాసించటం మొదలు పెడతారేమోనని భయపడకూడదు. మనం స్త్రీలనే కాక పురుషుల్ని కూడా సమీకరించగలం. మన పిల్లల్ని చక్కగా పెంచి మంచి మార్గమేదో చూపిస్తే వాళ్ళు సంఘటిత పడతారు. చిన్న పిల్లలు ఎందరో ఒత్తిడి హింసల్ని అనుభవించారు. ఐనా వాళ్ళు తమ కామ్రేడ్లను పట్టిచ్చేమాట అనలేదు. వాళ్ళు తమ తండ్రులతో పాటు పోరాడటమే దానికి కారణం.

స్త్రీలు గానీ పురుషులు గానీ విడివిడిగా పోరాటం చెయ్యలేరు. మనం ఐక్యమవ్వాలి. మొదట యింట్లో కుటుంబంగా, తర్వాత ఒక పూరి ప్రజలుగా, తర్వాత దేశ పౌరులుగా ఐక్యమవ్వాలి.

**అన్నిటికంటే ముఖ్యం సంఘం**

మీ గ్రామాల్లో మొదట మీరు చెయ్యవలసిన పనేమిటంటే-సంఘం పెట్టుకోవటం. సంఘం లేకపోతే మనకెన్ని మంచి ఆలోచనలున్నా మనం ప్రాణాల్ని త్యాగం చెయ్యటానికి సిద్ధంగావున్నా ఏ ప్రయోజనమూ ఉండదు. మనం ఏమీ సాధించలేము. అనవసర త్యాగాలవల్ల వచ్చేదేమీ ఉండదు. మీరు చావటానికైనా సిద్ధపడివచ్చు—కానీ మీ బతుకులవల్ల సమాజం ముందడగు వెయ్యాలి. అది ముఖ్యం. తోటి స్త్రీలకు నేర్పాలి.

నేను బజార్లో అమ్మటానికి రొట్టెలు వేస్తున్నంతసేపూ విచారంతో ఆలోచిస్తూనే వుంటాను. ఈ సమయంలో చదువుకోవాల్సిన అవసరంవున్న స్త్రీలంతా గుర్తొస్తారు. చదువుకున్న స్త్రీలు చదువురానివాళ్ళకు నేర్పాలి. చదువే కాదు అన్నివిషయాలూ. గనులవద్దవున్న మనకు ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోవటం చాలా తేలిక. దుకాణంముందు క్యూలో సుంచునీ కుట్టుపని చేసుకునే చోటా యింకా అనేకచోట్ల మనం కలుస్తుంటాం. అనేక విషయాలు ఒకరికొకరం చెప్పుకుంటాం. ప్రభుత్వ సంస్థవద్ద వాళ్ళు రాజకీయాలు మాట్లావొద్దనే అంటారు. కానీ మనం రాజకీయాలతోనే పుడుతున్నాం. పసిపాప పాలు కావాలనో తడిసిన పక్కబట్ట మార్చమనో కోరుతూ ఏడుస్తుంది. తనకు కావాల్సిన దానికోసం మనిషి చేసే ఆందోళననే కదా వీళ్ళు రాజకీయం అంటున్నారు.

మాకు మైనం కావాలి అని అడిగితే అది రాజకీయం. అది వామపక్ష రాజకీయం. మనల్ని దోపిడీచేసే వారికి కూడా రాజకీయాలున్నాయి. అవి మితవాద రాజకీయాలు. అందువల్ల రాజకీయాలకు అతీతంగా వుండటం సాధ్యం కానిపని. మనకు సామాజిక మార్పులు కావాలి. ఈ దోపిడీ విధానం రద్దు కావాలి. మన జీవన పరిస్థితులు మెరుగుపడాలి. మన భూమిలోని సంపదలన్నీ మనం అనుభవించాలి. ఈ మాటలన్నందుకే మనం రాజకీయ వాదులం, విప్లవకారులం అవుతున్నాం. మనందరం చైతన్యవంతులమై ప్రజా పోరాటాల్లో భాగమైపోదాం. మనం ఎక్కడికి వెళ్ళినా యిక్కడ యివాళ చెప్పుకున్న మాటలనే చెపుదాం.

ప్రియ పాఠకులారా!

మేము......

తెలుగు సాహిత్యంలో శాస్త్రీయ విలువలు పెంపొందించాలనే ధ్యేయం "హైదరాబాద్ బుక్ ట్రస్ట్"గా రూపు దిద్దుకొంది.

మా సంస్థ ప్రచురించే ప్రతి పుస్తకాన్ని ఆదరిస్తున్న సాహిత్యాభిమానులైన పాఠకులు 'బుక్‌క్లబ్' స్కీము క్రింద ముందుగా వంద రూపాయలు చెల్లించండి. మీరు చెల్లించిన మొత్తానికిగాను 25% డిస్కౌంట్ ఇస్తూ మీకు నచ్చిన పుస్తకాలను మేము పంపుతాము. మీ వంద రూపాయలకు సరిపడు పుస్తకములు మీకు అందిన పిదప మరల మీరు వంద రూపాయలు జమచేయండి - పుస్తకాలను వి.పి. ద్వారా మీకు అందజేస్తాము.

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

**We are now also distributing certain Left publications in English too (mainly those of Monthly Review, Zed Press, Feminist Press, South End Press, etc.) Those interested in purchasing these titles may place their order with us or ask for our English language Catalogue.**

## మా పుస్తకాలు

| | | |
|---|---|---|
| 1. ఆలోచించండి | -డా॥ మిత్రా | 1-00 |
| 2. వేదాల్లో ఏమున్నది? | -కొడవటిగంటి కుటుంబరావు | 1-25 |
| 3. గణపతి | -దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ | 1-25 |
| 4. నల్లచేప పిల్ల కథ | -సమద్ బెహరంగీ | 1-25 |
| 5. శూద్రులు-ఆర్యులు | -డా. బి. ఆర్. అంబేద్కర్ | 1-50 |
| 6. మీ పేరేమిటి? | -గురజాడ అప్పారావు | 1-25 |
| 7. టాల్‌స్టాయ్ కథలు | | 1-25 |
| 8. అనామకుడు | -జాక్ లండన్ | 1-00 |
| 9. పెట్టుబడిదారీ విధానం-దాని పరిణామం | -లియోహ్యూబర్మన్ | 3-00 |
| 10. ప్రపంచ కార్మికోద్యమ చరిత్ర | అనుసరణ : మహీధర రామమోహనరావు | 2-00 |

## మా పుస్తకాలు

| | | సాదా ప్రతి | మేలు ప్రతి |
|---|---|---|---|
| 1. | వేమన్నవాదం | 5-00 | |
| 2. | ఆంధ్రుల సంస్కృతి చరిత్ర I | 12-00 | 20-00 |
| 3. | ఆంధ్రుల సంస్కృతి చరిత్ర II | 14.00 | 25-00 |
| 3. | రాకెట్టు కథ | 9-00 | |
| 4. | పిడుగు దేవర కథ | 8-00 | 12-00 |
| 5. | స్పార్టకస్ | 13-50 | 20-00 |
| 6. | రక్తాశ్రువులు | 10-00 | — |
| 7. | భూమి | 13-50 | 20-00 |
| 8. | మా కథ | 10-00 | — |
| 9. | కల్యాణ మంజీరాలు | 10-00 | — |
| 10. | ఒక తల్లి | 5-00 | — |
| 11. | రాకాసి కోర | 6-00 | 9-00 |
| 12. | భారతదేశంలో నా జైలు జీవితం | 10-00 | 16-00 |
| 13. | కార్టూన్లలో మార్క్స్ | 10-00 | — |
| 14. | లెనిన్ | 10-00 | — |
| 15. | మావో | 10-00 | — |
| 16. | వైద్యుడు లేని చోట | 40-00 | 60-00 |
| 17. | ఉప్పెన | 5-00 | 8-00 |
| 18. | ఏడుతరాలు | 12-00 | 20-00 |
| 19. | చైత్రయాత్ర | 12-00 | 20-00 |
| 20. | తరతరాల భారత చరిత్ర | 15-00 | 25-00 |
| 21. | ఆధునిక భారత చరిత్ర | 16-00 | 28-00 |
| 22. | దళిత కథలు | 3-50 | — |

3,412

**దొమితిల బారియోస్ ది చుంగార**

1937–తన చుట్టూ వున్న పిల్లలందరిలాగే ఆమెకూడా భయంకర మైన దరిద్రంలో పెరిగింది. గనుల్లో పనిచేసే కార్మికుల పిల్లలు చదువు కునే అవకాశం అతి తక్కువగా ఉండేది. కానీ నేర్చుకోవాలనే పట్టుదల వల్లా, బలమైన కోరిక వల్లా ఆమె ప్రాథమిక పాఠశాలలో చదువు పూర్తి చేసింది. దొమితిలా గని కార్మికుడిని పెళ్ళాడి ఏడుగురు పిల్లలకు తల్లి యింది. 1963లో మొదట గృహిణుల కమిటీని స్థాపించినప్పటి నుంచీ ఆమె తన కాలంలో ఎక్కువ భాగం ఆ కమిటీకే వినియోగించింది 1975లో ఐక్యరాజ్య సమితి మెక్సికోలో తాము జరిపే అంతర్జా' మహిళా సమావేశంలో మాట్లాడమని ఆమెను ఆహ్వానించారు. 19' ఆమె జీవితాన్ని గురించి Let Me Speak (మా కథ) అనే పే ఒక పుస్తకాన్ని ప్రచురించారు. 1978 ఎన్నికలలో రివల్యూషనరీ పార్టీ తరపున రిపబ్లిక్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా పోటీ చేసింది. 1980 19న జరిగిన కుట్ర తరువాత బొలీవియాలో మిలటరీ ప్రభు అధికారంలోకి వచ్చాక ఆమెను ఆ దేశాన్నించి బహిష్కరించారు.

"Third world, second sex" Ed. Miran Davies London, 1983 నుండి అనువదించబడింది ఈ వ్యాస